క్లుప్తంగా

ద్రాక్షారామలో గీతా జయంతి వేడుకలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ గీతా మందిరంలో శనివారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. కృష్ణ భగవానుడికి మేలు కొలుపు, గీతా పారాయణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర స్థల దాత ఆళ్ల లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా పెంటపాటి నేడు బాధ్యతల స్వీకరణ


పెంటపాటి వెంకన్నబాబు

కపిలేశ్వరపురం: స్థానిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా కపిలేశ్వరపురానికి చెందిన పెంటపాటి వెంకన్న బాబు ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటి వరకూ ఇద్దరు డైరెక్టర్లు మాత్రమే ఉండగా మూడో ప్రతినిధిగా ఎంపికైన వెంకన్నబాబు చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోబోతున్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరు కానున్నట్టు వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కట్టా మురళి తెలిపారు.

పాడి గేదెకు కవల దూడల జననం



కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలంలోని మారేడుబాకలో అచ్చయ్య అనే రైతు సంరక్షణలోని పాడి గేదె కవల దూడలుకు జన్మనిచ్చింది. సాధారణంగా గేదెకు ఒక్క దూడ మాత్రమే పుడుతుంది. గేదెకు రెండు దూడలు పుట్టడం అరుదుగా జరుగుతుందని రైతులు చెప్పారు. దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని, తొలిసూరి కవల దూడలను అపురూపంగా చూసుకుంటానని రైతు అచ్చయ్య తెలిపారు.

హక్కులపై అవగాహన అవసరం

కపిలేశ్వరపురం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో వినియోగదారుడు స్థితిగతులు పూర్తిగా మారాయన్నారు. ఈ నేపథ్యంలో సరుకులు పైనా వాటి, ఉత్పత్తి, పంపిణీ, మార్కెట్, ధర, గ్యారెంటీ తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. వినియోగదారుల హక్కులను వివరిస్తూ కళాశాల నుంచి మారేడుబాక సెంటర్ వరకూ విద్యార్థులు ర్యాలీ చేసి, మానవహారంగా నిలుచుని అవగాహనా నినాదాలు చేశారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

కపిలేశ్వరపురం: విస్తృత సమాచారం గల నాణ్యమైన మెటీరియల్ పదో తరగతి పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించేందుకు ఉపకరిస్తుందని యూటీఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. మండపేటలోని ఎస్ఎస్‌వీవీ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి తన తల్లిదండ్రులు సత్యనారాయణరెడ్డి, రెడ్డి సుభద్రమ్మ జ్ఞాపకార్థం టెన్త్ స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రాయవరం: చలి కాచుకునేందుకు మంచం కింద పెట్టుకున్న కుంపటి ఆ వృద్ధురాలి పాలిట మృత్యువుగా మారింది. మండలంలోని సోమేశ్వరం కొత్త కాలనీకి చెందిన తాడి అచ్చమ్మ (70) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అచ్చమ్మ భర్త, కుమారుడు గతంలోనే మృతి చెందగా, ఆమె కోడలు పిల్లలతో కలిసి సామర్లకోటలోని తల్లి ఇంటి వద్ద నివశిస్తోంది. చలి కాలం కావడంతో చలి నుంచి రక్షణ పొందేందుకు అచ్చమ్మ పడుకునే మంచం కింద నిప్పుల కుంపటి పెట్టుకుంది. ఈ నెల 21న తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో కుంపటి నుంచి ఎగసిన నిప్పురవ్వలు మంచానికి అంటుకుని, తద్వారా దుస్తులకు అంటుకుని శరీరం కాలిపోయింది. చుట్టుపక్కల వారు అచ్చమ్మను రామచంద్రపురం ఆస్పత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లుగా వచ్చిన ఫిర్యాదుపై రాయవరం ఎస్సై జి.నరేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


దమ్ము ట్రాక్టర్ బోల్తా: వ్యక్తి మృతి

కాజులూరు: జగన్నాథగిరికి చెందిన కొల్లాబత్తుల సురేష్ (30) దమ్ముట్రాక్టర్ బోల్తా పడి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జగన్నాథగిరిలో వలంటీర్‌గా పని చేస్తున్న కొల్లాబత్తుల సురేష్ తీరిక సమయాల్లో ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. శుక్రవారం మతుకుమిల్లిలోని ఒక రైతు పొలంలో దమ్ము చేస్తుండగా ట్రాక్టరు తిరగబడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు సురేష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. కేసును గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వెలంపాలెం లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు


గొల్లపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు


అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు


విజయదుర్గాపీఠంలో భక్తులకు దర్శన మిచ్చిన విజయ వేంకటేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో కందులపాలెం వేంకటేశ్వరస్వామి వారు

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

రామచంద్రపురం రూరల్: మండలంలోని రూరల్ గ్రామాల్లోను, రామచంద్రపురం పట్టణంలోను దేవాలయాలు ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శనివారం భక్తులతో కిటకిటలాడాయి. దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాశ్వరస్వామి ఆలయంలో వేంచేసిన లక్ష్మీనారాయణస్వామి, ఆలయ ప్రాంగణంలోని సత్యనారాయణస్వామి దేవాలయం, ద్రాక్షారామలో వేంకటేశ్వరస్వామివారి ఆలయం, కందులపాలెం వేంకటేశ్వరస్వామి, భీమక్రోసుపాలెంలో కోదండ రామాలయం, వెలంపాలెంలో లక్ష్మీనారాయణస్వామివారి, తోటపేట రామాలయం తదితర దేవాలయాల్లో భక్తులు ధనుర్మాసం సందర్భంగా ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని తెల్లవారుజాము నుంచే దేవాలయాలకు క్యూలు కట్టారు. ఆయా దేవాలయాల్లో ఏకాహాలు, భజనలు, దీపోత్సవాలు నిర్వహించారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: రామచంద్రపురం పట్టణంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, మార్కెట్ వద్ద వేంకటేశ్వరస్వామివారి ఆలయం తదితర దేవాలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం ఏర్పాటు చేశారు. రాజగోపాల్ సెంటర్ వద్ద సీతారామ భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని క్యూలో స్వామివార్లను దర్శించుకున్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

కాజులూరు: వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శనివారం కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో వైష్ణవాలయాల్లో భక్తులు పూజలు ఘనంగా నిర్వహించారు. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి, లేదా ముక్కోటి ఏకాదశి అని అంటారు. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకుని ఉంటాయని వైష్ణవాలయాల్లోని ఉత్తర ద్వారం వద్ద భక్తులు తెల్లవారుజామునే వేచి ఉంటారు. ముక్కోటి రోజున మహావిష్ణువు గరుడ వాహనాధారుడై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని అందుకే దీనికి ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమాట. అందువల్లే దీన్ని ముక్కోటి ఏకాదశి అంటారని కూడా చెబుతుంటారు. ముక్కోటి ఏకాదశి నాడే హలాహలం, అమృతం పుట్టిందంటారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని కాజులూరు, గొల్లపాలెం, అయితపూడి, శీల, కోలంక గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనాలు చేసుకున్నారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.


మండపేటలో స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

వైభవంగా 'ముక్కోటి' పూజలు

కపిలేశ్వరపురం: ముక్కోటి ఏకాదశి పూజలను శనివారం మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజామునే పుణ్య స్నానాలు ఆచరించి, కుటుంబ సమేతంగా వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూలో బారులు తీరారు. మండపేట పట్టణం కలువపువ్వ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామి, కపిలేశ్వరపురం మండలం అంగరలోని వైభవ వేంకటేశ్వర స్వామి, టేకిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అర్తమూరు, ద్వారపూడి, ఏడిద, తాపేశ్వరం, వేములపల్లి, ఇప్పనపాడు, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, మారేడుబాక, కేశవరం, జెడ్. మేడపాడు గ్రామాల్లోని దేవతామూర్తుల ఆలయాలను భక్తులు సందర్శించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండపేట పట్టణంలోని వేంకటేశ్వర స్వామిని ఆత్రేయపురం మండలం వాడపాలెంలోని స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కేశవరంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా సహాయ కార్యదర్శి అబ్బిరెడ్డి వీర్రాజు ఇంటి వద్ద నిర్వహించిన ఏకాహంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, మండల సాగు సలహామండలి చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, తుపాకుల ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం మండలంలో...

మండలంలోని 19 గ్రామాల్లో శనివారం వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా నిర్వహించారు. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయానికి గ్రామంతో పాటు పడమర ఖండ్రిక, కోరుమిల్లి, వెదురుమూడి, తాతపూడి, కపిలేశ్వరపురం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. ఆలయ నిర్వాహణకు సహకరిస్తున్న పలువురుని నిర్వాహకులు సత్కరించారు. ఆలయ అర్చక బృందం స్వామిని విశేషంగా అలంకరించారు. టేకిలోని వేంకటేశ్వరస్వామి, అంగర, నల్లూరు, వెదురుమూడి, వల్లూరు, కాలేరు గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాలను భక్తులు సందర్శించారు.

వైకుంఠ ద్వార దర్శనం.. ముక్తికి మార్గం

రాయవరం: వైకుంఠ ద్వార దర్శనం ముక్తికి మార్గమని వెదురుపాక విజయదుర్గ పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా శనివారం పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్ మాట్లాడుతూ ఏకాదశి శ్రీమహావిష్ణువుకు ఎంతో ప్రీతికరమన్నారు. ముక్కోటి ఏకాదశుల పుణ్యఫలం ఒక్క రోజున లభించేలా చేసేదే ముక్కోటి ఏకాదశిగా ఆయన పేర్కొన్నారు. పీఠంలోని శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి వారికి పీఠం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారి దర్శనం కల్పించారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

వాడవాడలా ఏకాహాలు

మండలంలోని పలు రామాలయాలు, వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వి.సావరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు, సోమేశ్వరం తదితర గ్రామాల్లో ఆలయాల వద్ద వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని కీర్తిస్తూ భజన పాటలతో ఏకాహాలు నిర్వహించారు. బుధవారం ఉదయం వరకు నిరంతరాయంగా భజన గీతాలను ఆలపించనున్నట్లు ఆలయ కమిటీలు తెలిపాయి. సోమేశ్వరంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయాన్ని పూలతో నయనానందకరంగా అలంకరించారు.

నిస్వార్థ సేవకుడు మంత్రి వేణు


మంత్రి వేణు పుట్టినరోజు సందర్భంగా గొల్లపాలెంలో కేక్ కట్ చేసి పంచుతున్న ఏసురాజు, బుల్లిరాజు తదితరులు


కె.గంగవరంలో మంత్రి వేణు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు


ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న మంత్రి వేణు

కాజులూరు: తాను పాలకుడిని కాదు, సేవకుడిని అంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నిస్వార్థ సేవకుడని, ఆయన సేవలు ప్రజలు ఎన్నటికీ మరువలేరని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంత్రి వేణుగోపాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను శనివారం ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, ప్రజలు ఘనంగా నిర్వహించారు. గొల్లపాలెం గ్రామ సచివాలయం-2 వద్ద పార్టీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ పోతురాజు బాబూరావు ఆధ్వర్యంలోనూ కాజులూరు మండల పరిషత్ ఆవరణలో ఎంపీపీ మాత భారతీ, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావుల ఆధ్వర్యంలోనూ, చేదువాడలో సర్పంచ్ గంజాదేవి ఆధ్వర్యంలోనూ జరిగిన కార్యక్రమాల్లో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని మంత్రి వేణు పుట్టినరోజు కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలు పలుచోట్ల పేదలకు బట్టలు, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మాజ, దొమ్మేటి కొండ, కాకి శ్రీనివాసరావు, మాత నాగరాజు, బుంగ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ జన్మదిన వేడుకలను శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని 26 గ్రామాల్లో చెల్లుబోయిన వేణు జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల పరిధిలోని దంగేరులో ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యాన నిర్వహించిన జన్మదిన వేడుకల్లో పలువురు పాల్గొని భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంచారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ పంపన నాగమణి ఆధ్వర్యంలో మంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, ఎస్సీ నాయకులు బత్తుల అప్పారావు, మండల బూత్ కమిటీ అధ్యక్షుడు తోకల శ్రీను పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి వేణు పుట్టినరోజు వేడుకలు

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి వేణు తిరుపతిలో వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని రాత్రికి ద్రాక్షారామ చేరుకున్నారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు మంత్రి వేణును సత్కరించారు. అనంతరం రామచంద్రపురం మంత్రి వేణు క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం పట్టణం, కె.గంగవరం, కాజులూరు మండలాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మంత్రి వేణుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. బాణసంచా మందు కాల్పులతో పట్టణంలో సందడి నెలకొంది.

బోస్‌ను కలసిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్, తనయుడు సూర్యప్రకాష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రామచంద్రపురంలోని పార్టీ కార్యాలయం వద్ద వారికి కలుసుకుని రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తమవంతు సహకారం అందిస్తామని బోస్‌తో వారు చెప్పారు. సీఎం జగన్ ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు సంతోషంగా ఉన్నారని రానున్న కాలంలో కూడా మరిన్ని సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతారని వారు పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టికూటి రాజశేఖర్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు బత్తుల అప్పారావు, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


బోస్‌ను మర్యాదపూర్వకంగా కలసిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు

భీమేశ్వరాలయంలో జలప్రసాద కేంద్రం ప్రారంభం

రామచంద్రపురం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రముఖ ఫార్మా కంపెనీ దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మూడో జల ప్రసాదం కేంద్రాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శనివారం ప్రారంభించారు. మంత్రి వేణు మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా గుర్తించి దివీస్ సంస్థ భక్తుల కోసం మంచి సురక్షిత మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆర్. సుధాకర్, సీహెచ్ శ్రీనివాసులు, ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఎంపీటీసీలు తుమ్మూరి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో జల ప్రసాదం కేంద్రాన్ని స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి వేణు

వ్యక్తిత్వ వికాసానికి యోగా దోహదం

రాయవరం: మనస్సు, ఆత్మ, శరీరాన్ని ఏకం చేసే సాధనే యోగా అని సద్గురు సచ్చిదానంద యోగి, ప్రొఫెసర్ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి అన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విశ్వ మానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారములు, యోగాసనాలు, గీతా శ్లోకాల పోటీల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక సమతౌల్యం ఏర్పడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాను అభ్యసించడం వలన ఓర్పు, బుద్ధి కుశలతతో పాటుగా పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలుగుతారన్నారు. విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మానవత సంస్థల ద్వారా యోగ విద్యను విస్తరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన యోగాభ్యాసకులకు, భగవద్గీత అభ్యాసకులకు శ్లోకాలు, యోగాసనాల పోటీలు నిర్వహించారు.

ఆడుదాం ఆంధ్ర ప్రారంభ వేడుకలు

రామచంద్రపురం రూరల్/రామచంద్రపురం: ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా సన్నాహక ఏర్పాట్లలో శనివారం రామచంద్రపురం ఎంపీడీఓ కార్యాలయంలో, పట్టణంలోని చప్పిడి వారి సావరం ఓపెన్ ఆడిటోరియం వద్ద యోగా, పలు క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్.కీర్తి స్పందన, మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్‌రెడ్డి, పలువురు పీడీలు, పీఈటీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కమిటీ నియామకం


మరివాడ సూరిబాబు


అద్దంకి వెంకటరమణ


చాపల అబ్బన్న


పాలమాల సత్తిబాబు


గెద్దం గాంధీబాబు


బక్కి సుధాకర్

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైతు విభాగం కమిటీని నియమించారు. జిల్లా కార్యదర్శిలుగా మండల కేంద్రమైన కపిలేశ్వరపురానికి చెందిన మరివాడ సూరిబా బు, మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన అద్దంకి వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా రాయుడు వెంకటరమణ నియమితులయ్యారు. వారంతా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జిల్లా ఎస్సీ సెల్ నియామకం

కపిలేశ్వరపురం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్సీ సెల్ కమిటీని నియమించారు. జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా రాయవరం మండలం వెంటూరుకు చెందిన చాపల అబ్బన్న నియమితులయ్యారు. కార్యదర్శిలుగా మండపేట పట్టణానికి చెందిన పాలమాల సత్తిబాబు, మండపేట మండలం జెడ్. మేడపాడు గ్రామానికి చెందిన గెద్దం గాంధీ బాబు, సంయుక్త కార్యదర్శిగా కపిలేశ్వరపురం మండలం కాలేరుకు చెందిన బక్కి సుధాకర్ నియమితులయ్యారు. తమకు ప్రాధాన్యతనిచ్చిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.

సృజనను వెలికితీసే వేదిక సైన్స్ ఫెయిర్

- విజేతలను ప్రకటించిన న్యాయ నిర్ణేతలు
- రాష్ట్ర స్థాయికి ఎంపికైన తొమ్మిది ప్రాజెక్టులు

రామచంద్రపురం: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనను గుర్తించి వెలికి తీసే సరైన వేదిక జిల్లా విద్యా వైజ్ఞానిక సదస్సు అని రామచంద్రపురం, మండపేట మున్సిపల్ చైర్మన్లు గాదంశెట్టి శ్రీదేవి, పతివాడ నూకదుర్గారాణి పేర్కొన్నారు. రామచంద్రపురంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన శనివారం సాయంత్రం ముగిసింది. రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద లక్ష్మీ నరసింహఫణి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో శ్రీదేవి, నూకదుర్గారాణిలు మాట్లాడుతూ విద్యార్థుల్లో మేధో సంపత్తిని గుర్తించి, వారిని ఆ దిశగా ప్రోత్సహించేందుకు జిల్లా సైన్స్‌ఫేర్ ఎంతగానో ఉపకరించిందన్నారు. రాష్ట్ర స్థాయికి మూడు విభాగాల నుంచి తొమ్మిది ప్రాజెక్టులు ఎంపికైనట్లు తెలిపారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏపీవో డాక్టర్ ఎంఏకే భీమారావు, కాకినాడ డీఎస్‌వో వినీల్, జిల్లా మాజీ సైన్స్ అధికారి జి.వసంత్‌కుమార్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ సీవో డి.రమేష్‌బాబు, ఏఎంవో పి.రాంబాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈవోలు పి.షాలెంరాజు, ఎం.శ్రీనివాసు, నాయుడు రామచంద్రరావు, వాసంశెట్టి నాగేశ్వరి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు, ఉపాధ్యాయులతో డీవైఈవో ఫణి, డీఎస్‌వో సుబ్రహ్మణ్యం తదితరులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు ఇవే

జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో నాలుగు విభాగాల్లో ప్రాజెక్టులను ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా 88 పాఠశాలల నుంచి 93 ప్రాజెక్టులు ప్రదర్శించారు. విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాల్లో ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో ప్రతి విభాగం మూడు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. వ్యక్తిగత విభాగంలో ప్రోత్సాహక బహుమతిగా జెడ్పీహెచ్ఎస్ తొండవరం, అంబాజీపేట, గ్రూపు విభాగంలో ప్రోత్సాహక బహుమతిని జెడ్పీహెచ్ఎస్, పి.అగ్రహారం, అంబాజీపేట మండలం. ఉపాధ్యాయ విభాగంలో ప్రోత్సాహక బహుమతిని జెడ్పీహెచ్ఎస్, తొండవరం, అంబాజీపేట మండలం పొందాయి. అటల్ ల్యాబ్ ప్రోత్సాహక బహుమతులుగా జెడ్పీ(బాలురు), రాజోలు, జెడ్పీ(బాలురు), సూర్యనగర్, అమలాపురం, జెడ్పీహెచ్ఎస్, జి.వేమవరం పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. ఇండియన్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ గన్నమనేని చక్రవర్తి సౌజన్యంతో ప్రతి విభాగంలో ఒక్కొక్కరికి నగదు బహుమతులుగా రూ.2 వేలు వంతున నగదు బహుమతిని అందజేశారు. కేవీఆర్ ఆస్పత్రి అధినేత కె.నాగసత్యనారాయణ సౌజన్యంతో రూ.10 వేలు విలువైన మెమెంటోలు అందజేశారు. అడ్డూరి జగన్నాథవర్మ సౌజన్యంతో విద్యార్థులకు తాగునీరు అందజేశారు. వ్యక్తిగత విభాగంలో అనీల సుధ(అమలాపురం), కడలి శ్రీరామ్ (మామిడికుదురు), కె.లావణ్య (మండపేట), గ్రూపు విభాగంలో రామచంద్రపురం, అయినవిల్లి, వన్నెచింతలపూడి స్కూళ్లు బహుమతులు అందుకున్నాయి.

క్రిస్మస్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కాజులూరు: మండల గ్రామాల్లో క్రిస్మస్ సందడి కొనసాగుతుంది. ఈనెల 25న క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవ మత పెద్దలు ముందస్తుగానే క్రిస్మస్ వేడుకలు ప్రారంభించారు. క్రైస్తవులు తమ ఇళ్లపై క్రిస్మస్ స్టార్‌లను ఏర్పాటు చేయగా పలువురు తమ ఇళ్లను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఇక గ్రామాల్లో చర్చిలైతే మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతున్నాయి. గత వారం రోజులుగా మండలంలో ప్రతి రోజు ఏదో ఒక చోట ప్రత్యేక ప్రార్థనలు, సువార్త కూటములు జరుతున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి గుర్తింపు పొందిన పాస్టర్లు వచ్చి బైబిల్ సారాంశాలను, ఏసుక్రీస్తు జన్మరహస్యాలను భక్తులకు వివరిస్తున్నారు. సోమవారం క్రిస్మస్ పురస్కరించుకుని మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని మండల పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి శాంతిలాల్ తెలిపారు. సుమారుగా జనవరి ఒకటో తేది వరకూ క్రైస్తవ భక్తులు మండల గ్రామాల్లో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో భాగంగా గొల్లపాలెం చర్చిలో ఏర్పాటు చేసిన క్రీస్తు జనన దృశ్యాలు